క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



చెన్నారావుపేట : రిపబ్లిక్ డేను పురస్కరించుకొని జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా కలెక్టర్‌చే అవార్డు పొందిన తహసీల్దార్ బన్సీలాల్‌ను సిబ్బంది శుక్రవారం పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్, గిర్దావర్ స్వామి, సీనియర్ అసిస్టెంట్ సంపత్, జూనియర్ వెంకన్న, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌కు ప్రవేశపరీక్ష



సంగెం: మండల పరిధిలోని విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు దరుణి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ రణధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న స్థానిక విద్యాభారతి హైస్కూల్‌లో టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షరాసే విద్యార్థులు 9642244996 నంబర్‌కు ఫోన్ చేసి పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపు కబడ్డీ సెలక్షన్స్

చెన్నారావుపేట: ఈ నెల 29న స్థానిక జాగృతి హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జోనల్‌స్థాయి కబడ్డీ సెలక్షన్స్ ఉంటాయని జోనల్ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కంది కృష్ణచైతన్యరెడ్డి శుక్రవారం తెలిపారు. చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం మండలాల పరిధిలోని కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మీస అరవింద్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలు కనుమరుగుతున్న రోజుల్లో క్రీడాకారుల నైపుణ్యానికి వెలికితీయడానికి ఈ క్రీడలు దోహదపడుతాయన్నారు. జోనల్ స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

పెరిగిన వడ్డీ రేట్లు

వర్ధన్నపేట : తపాలశాఖలో పొదుపు ఖాతాదారులకు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని నార్త్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమన్‌గౌడ్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని పొదుపు పథకాల్లో భాగస్వామ్యం పంచుకోవాలని కోరారు. భారత ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ రేట్లను సవరిస్తుందని ఇందులో భాగంగా జనవరి 1, 2023 నుంచి పోస్టాఫీస్ వడ్డీ రేట్లు భారగా పెంచిందన్నారు. సేవింగ్స్ ఖాతా 4 శాతం, రికరింగ్ డిపాజిట్ ఖాతా 5.8 శాతం, టైం డిపాజిట్ ఖాతా ఏడాదికి 6.6 శాతం, రెండేళ్లకు 6.8 శాతం, మూడేళ్లకు 6.9 శాతం, ఐదేళ్లకు 7 శాతం, నెలవారి ఇన్‌కమ్ స్కీం 7.1 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ 7 శాతం, కిసాన్ వికాస్ ఖాతాకు 7.2 శాతం, పీపీఎఫ్ ఖాతాకు 7.1 శాతం, వడ్డీ లభిస్తుందన్నారు.

ఎలక్ట్రీషియన్ డే వేడుకలు



వర్ధన్నపేట : పట్టణంలో ఎలక్ట్రీషియన్లు ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు కోమలగిరి రాము మాట్లాడుతూ ప్రపంచానికి చీకటిని పారద్రోలి వెలుగును ప్రసాదించిన మహానుభావుడు థామస్ అల్వా ఎడిసన్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజిడి వాసుదేవరెడ్డి, మహేందర్‌రెడ్డి, తక్కళ్లపెల్లి విష్ణుప్రసాద్, దాసరి భిక్షపతి, బాలాజీ రాకేష్, సాంబమూర్తి, భాషా, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెం శివారు పెద్దతండాలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ..రుద్రగూడెంకు చెందిన అజ్మీర లాలు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఖానాపురం గ్రామానికి చెందిన చెంచు రమేష్ రుద్రగూడెం నుంచి నర్సంపేట వైపు తన ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి లాలును ఢీకొంది. దీంతో ఇద్దరు గాయపడగా చికిత్స కోసం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేపు ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో సదస్సు

విద్యారణ్యపురి: హనుమకొండ బాలసముద్రంలోని సామజగన్ మెమోరియల్ భవనంలో ఈనెల 29న ఉదయం ప్రజ్ఞాభారతి వరంగల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజ్ఞా భారతి కన్వీనర్ ప్రొఫెసర్ ఎల్.రాంగోపాల్‌రెడ్డి, కోకన్వీనర్ టి.బుచ్చిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నిజాం దురాగతాలు–హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్య వీరోచిత పోరాట విశేషాలు – విస్మరించలేని చారిత్రక వాస్తవాలు' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భారంగా కుటుంబ పోషణ

- ఎక్కువ పని..తక్కువ వేతనం
- సీఆర్‌పీలపై ప్రభుత్వం చిన్నచూపు
- కానరాని ఉద్యోగ భద్రత



మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న సీఆర్‌పీలు(ఫైల్)

చెన్నారావుపేట : విద్యావ్యవస్థను పటిష్టపర్చడంలో ప్రముఖ పాత్రను పోషిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. 2012లో ఎమ్మార్సీ విధానాన్ని రద్దు చేసి సీఆర్‌పీని అమల్లోకి తెచ్చింది. కలెక్టర్ చైర్మన్‌గా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటిస్తూ బీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను నియమించింది. నాటి నుంచి నేటి వరకు పాఠశాలల బలోపేతానికి కీలక బాధ్యతల్లో విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ జిల్లాలో 68 సీఆర్‌పీలు విధులు నిర్వహిస్తున్నారు. తక్కువ వేతనం ఇస్తుండటంతో కుటుంబ పోషణ భారం అవుతుందని, పనికి తగ్గ వేతనం రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. పని ఒత్తిడితో మానసికంగా కుంగిపోతున్నామని ఆరోపిస్తున్నారు.

సీఆర్‌పీల విధులు

జిల్లాలో 68 మంది సీఆర్‌పీలు ఎంఈఓలకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తారు. బడి బయట ఉన్న పిల్లల ను బడిలో చేర్పించడం, సింగిల్ టీచర్ సెలవులో ఉంటే స్కూల్‌కు వెళ్లి బోధన చేయడం, ప్రతిరోజు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణ విధులు నిర్వహించాలి. మధ్యాహ్న భోజన అమలు–పర్యవేక్షణ, సమగ్ర శిక్ష అభియాన్ అమలు చేయడం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పూర్తి నివేదిక అందించడ, మన ఊరు–మన బడి, పాఠశాలలో నిర్వహించే కార్యక్రమంలో భాగస్వాములు అవుతారు.

అందని సమాన వేతనం

2012లో మొదటి వేతనం రూ. 5500 ఇచ్చా రు. ప్రస్తుత వేతనం రూ. 19,500 ఇస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం (రూ.30,500) ఇవ్వాలని చట్టాలు చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదు. ప్రతి సంవత్సరం పాఠశాలలు విజిట్ చేయడానికి, ఫోన్‌బిల్లు, నెట్‌బిల్లు సుమారుగా రూ. 5 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎమ్మార్సీ కార్యాలయం

ఇతర రాష్ట్రాల్లో వేతనాలు

హిమాచల్‌ప్రదేశ్‌లో రూ. 51 వేలు, ఉత్తరాఖాండ్‌లో రూ. 55 వేలు, సిక్కింలో రూ. 60 వేలు, తమిళనాడులో రూ. 51 వేలు, హర్యానాలో రూ. 54 వేలు, ఏపీలో రెండేళ్లనుంచి రూ.23,500 వేతనం చెల్లిస్తున్నారు. కాని మన రాష్ట్రంలో తక్కువ వేతనం ఇస్తున్నారు. పనితీరును గుర్తించి తగిన వేతనంతో



బడిమానేసిన పిల్లలను గుర్తించే సర్వేలో సీఆర్‌పీ

కూడిన ఉద్యోగ భద్రత కల్పించాల కోరుతున్నారు.

మంత్రులకు వినతులు

గతంలో ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ ఫలితం లేదు. మంత్రులు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, దయాకర్‌రావు, ఎమ్మెల్యేలను కలిసి పలుమార్లు వినతి పత్రాలు అందించినా పరిశీలిస్తామని చెప్పారు కానీ పట్టించుకున్న పాపన పోలేదు.

అగ్రిమెంట్ విధానం రద్దు చేయాలి



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో జీవితాలు వెలుగొందుతాయని ఆశ పడ్డాం. మన రాష్ట్రంలోనే తక్కువ వేతనాలు ఇస్తున్నారు. అగ్రిమెంట్ విధానంను రద్దు చేసి పర్మినెంట్ చేయాలి.

– ముదురుకోళ్ల సంపత్, జిల్లా కోశాధికారి

పనికి సమాన వేతనం ఇవ్వాలి



పాఠశాలల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్న సీఆర్‌పీలకు సమాన పనికి సమాన వేతనం అందించాలి. మహిళలకు వే తనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– దొనికెల శ్రీధర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులు మనసుతో పరీక్షలు రాయాలి



వర్ధన్నపేట : ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

చెన్నారావుపేట : విద్యార్థులు ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాయాలని ఉప్పరపల్లి హైస్కూల్ హెచ్ఎం ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో శుక్రవారం ప్రధానమంత్రి పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల కారణంగా విద్యార్థుల్లో ఎదురయ్యే ఒత్తిడిని జయించేందుకు ప్రధాని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారన్నారు. కార్యక్రమంలో చిన్నారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారన్నారు. పాఠశాలలో 186 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు.

వర్ధన్నపేట: వర్ధన్నపేట, కట్ర్యాల ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ప్రధాని మోదీ పరీక్షపై చర్చ కార్యక్రమాన్ని టీవీలో విద్యార్థులు వీక్షించారు. ప్రతి ఒక్క విద్యార్థి తన సమయం విలువను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు, కొండేటి సత్యం, పెద్దూరి రాజు, ఐద రవికుమార్, గిరిప్రసాద్, బొంపెల్లి దేవేందర్‌రావు, కొండేటి బాబు, సోమేశ్వర్‌రావు, విక్రమ్, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సంగెం : మండలంలోని కొత్తగూడెం, నర్సానగర్ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కొత్తగూడెంలో రూ.15 లక్షలు, నర్సానగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వాసం రజిత, జాటోత్ చత్రునాయక్, ఉపసర్పంచ్‌లు రజిత, వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం ప్రతిష్ఠాపనకు ముహూర్తం ఖరారు

గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ నూతన రాజగోపురం ప్రతిష్ఠాపన మహోత్సవం ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ ఈఓ గుళ్లపెల్లి శేషగిరి తెలిపారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 24న జరిగే మహా కుంభాభిషేకానికి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ దేవనాథ జీయర్‌స్వామిని కోరడంతో అయన తమ ఆహ్వానాన్ని మన్నించి వస్తానని మాట ఇచ్చారన్నారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అయనకు స్వయంగా అందించామన్నారు. కలిసిన వారిలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, విష్ణు, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వీరాటి రవీందర్‌రెడ్డి ఉన్నారు.



చిన్నజీయర్‌స్వామిని కలిసి ఆహ్వానిస్తున్న ఈఓ

పాఠశాలలో నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంటశాల, మూత్రశాలల నిర్మాణ పనులకు వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, వంగాల భగవాన్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు అంకూస్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాపని రవీందర్, ప్రధాన కార్యదర్శి రేవూరి ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, హెచ్ఎం లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులు పార్వతి, కళ్యాణి పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి

దామెర : కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ మంజుల కోరారు. మండల కేంద్రంలోని కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కంటివెలుగు రెండో విడత కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజల కోసం మండల కేంద్రంలో, ఊరుగొండలో శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 874 మంది, ఊరుగొండ కేంద్రంలో 701 మంది పరీక్షలు నిర్వహించినట్టు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు సందీప్, ఉషారాణి, సిబ్బంది శ్రీకాంత్, అశోక్ బాబు, శ్రీధర్, బాబు, మౌనిక, పద్మ, శోభారాణి, సంధ్య, ఉమ, భారతి, లావణ్య, మమత, సుమలత, రజిత, శైలజ, లీలారాణి, సుజాత, శ్రీదేవి, కవిత తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ మంజుల

నేడు వాల్తేరు వీరయ్య విజయోత్సవ సభ

పరకాల : మెగా స్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య విజయోత్సవ సభ హన్మకొండలో ఈనెల 28న నిర్వహించనున్నట్లు చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ పరకాల అధ్యక్షుడు బొచ్చు భాస్కర్ తెలిపారు. కాకతీయ థియేటర్ ఆవరణలో వాల్తేరు వీరయ్య విజయోత్సవ సభ పాసులను అభిమానులకు శుక్రవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. హీరోలు చిరంజీవి, రవితేజతోపాటు వాల్తేరు వీరయ్య యూనిట్ సభ్యులు హాజరౌతారని తె లిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

29న సీఆర్పీల మహాసభ

దామెర : ఈనెల 29న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో క్లష్టర్ రిసోర్స్‌పర్సన్ల (సీఆర్పీ)ల రాష్ట్ర దశాబ్ది మహాసభ నిర్వహించనున్నట్లు సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు జిల్లాలోని సీఆర్పీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్, ఉపాధ్యక్షులు రమేష్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సమన్యాయం



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హన్మకొండలోని తన నివాసంలో బీజేపీ నుంచి చేరిన వారికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కట్టుబడి పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని అక్కడి ప్రజలు ఆయా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి, రైతు కమిటీ ప్రధాన కార్యదర్శి పాడి చంద్రారెడ్డి, నాయకులు తాళ్లపెల్లి రవీందర్, వర్ధం శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట

నయీంనగర్: రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి చీఫ్‌విప్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ కోమల, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, డీపీఆర్ఓ లక్ష్మణ్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్, కోశాధికారి బొల్ల అమర్, సీనియర్ జర్నలిస్టులు, కార్యవర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'చల్లా' అక్రమాలను ఎండగడతాం

- మొరం దందాపై బహిరంగ చర్చకు రావాలి
- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

గీసుకొండ : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నియోజకవర్గంలోని చెరువులు, కుంటల్లోని మట్టిని అక్రమంగా అనుమతి లేకుండా తరలిస్తున్నాడని, అతడి అక్రమాలను ఎండగడతామని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని బొడ్డుచింతలపెల్లి చెరువులో ఎమ్మెల్యే ఎలాంటి అనుమతులు లేకుండా వేలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నాడంటూ చెరువు ప్రాంతాన్ని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ చందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మొలుగూరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రకృతి వనరులను ఎమ్మెల్యే బంగారు బాతులా మార్చుకుని అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. 20 చెరువుల మొరాన్ని అక్రమంగా తరలిస్తూ కోట్లాది రూపాయలను సంపాదిస్తున్నారన్నారు. ఈ విషయమై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాన్‌విక్రం, నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, నాయకులు బిల్ల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, జిల్లా కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతికుమార్, ఆరకట్ల ప్రవీణ్, మరిపూడి శ్రీనివాస్, బూర్గుల యుగేందర్, కైరిక రవికుమార్ పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

నర్సంపేట : గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు బలోపేతం చేస్తూ వారు తీసుకునే రుణాలు సక్రమంగా తిరిగి చెల్లించే విధంగా బాధ్యతలు వహిస్తూ ప్రభుత్వ పథకాలను మహిళలకు చేరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వీఓఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (బీఆర్ఎస్‌కేవీ అనుబంధం) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు గోనె యువరాజు, జిల్లా అధ్యక్షుడు పోలదాసరి రమేష్ మాట్లాడుతూ వీఓఏల సమస్యలపై శాసనసభలో ఎమ్మెల్యే మాట్లాడి వేతనాలు పెంచడంలో కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణ, ఉపాధ్యక్షులు ఏకాంబరం, నాయకులు ప్రసాద్, వెంకన్న, శ్రీదేవి, సుధా, బాబు, శ్రీను, రవి, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వారితో చర్చిస్తున్న పోలీసులు

నల్లబెల్లి : విద్యుత్ కోతలను నిరసిస్తూ సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో మండలంలోని రుద్రగూడెంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాస్తారోకో చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రాకపోకలకు అంతరాయం తలెత్తడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు రాస్తారోకో వద్దకు చేరుకుని సీపీఎం, కాంగ్రెస్ నాయకులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కడియాల మనోహర్ మాట్లాడుతూ 24 గంటల ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వ ప్రకటనలకు ప్రస్తుత పరిస్థితులు పూర్తిగా విరుద్ధంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తూ కరెంటు కోతలను నివారిస్తూ 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగరపు లింగయ్య, కాల్‌నాయక్, కట్ల రాములు, ఈర్ల అనిల్, బ్రహ్మచారి, వక్కల బుచ్చయ్య,మల్లాడి విజేందర్‌రెడ్డి, తిరుపతి, మధు, మొగిలి, పాల్గొన్నారు.

31 నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం : ఈనెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో మండలంలోని ధర్మారావుపేటలోని పగడాల వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు తెలిపారు. ఆలయం వద్ద ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి ఆలయం రెండో వార్షికోత్సవ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెన్ను సమ్మయ్య, వెన్ను పూర్ణచందర్, కత్తాల వెంకటేశ్వర్‌రావు, రాకేష్, పురోహితులు అన్వేష్‌శాస్త్రీ, వెంకన్న, పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ను ఆయన నివాసంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వరంగల్ రెడ్‌క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, కందకట్ల నరహరి, ఆత్మకూరు మార్కెట్ చైర్మన్ రవియాదవ్, మాజీ కుడా డైరక్టర్ ఎనకతాళ్ల రవీందర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బుచ్చిరెడ్డి, మునిగాల సురేందర్‌రావు, అన్వర్, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ..



ఆత్మకూరు : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్, నీరుకుళ్ల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పలువురు ఇటీవల చనిపోగా వారి కుటుంబాలను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ..



నడికూడ : పరామర్శిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లె గ్రామానికి చెందిన బండి ప్రవీణ్ ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శుక్రవారం పరామర్శించారు. అనంతరం ప్రవీణ్ కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రావు, లోకాటి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నడికూడ : మండల కేంద్రానికి చెందిన కామిద్రి కృష్ణ (25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణ కొద్ది రోజులుగా వెన్ను నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబీకులు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్చారు. శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.